క్లుప్తంగా

శ్రీశైల మల్లికార్జుని సన్నిధిలో ముత్తంశెట్టి



శ్రీశైలంలో కొలువైన మల్లికార్జున స్వామిని మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం సతీ సమేతంగా దర్శించుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

- తగరపువలస

గణపతి ఉత్సవాలకు రాట



ఉత్సవరాట వేస్తున్న మంగరాజు

తగరపువలస: సంగివలస అనిట్స్ కళాశాల ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు గణపతి ఉత్సవాలకు సోమవారం రాట వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు లోవరాజు, తాటిశెట్టి వెంకట అప్పారావు, నమ్మి రవి తదితరులు పాల్గొన్నారు.

భూబాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

తగరపువలస: విజయవాడలో ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన భూబాధితుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని భీమిలి డివిజన్ సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, మావూరి వీర్రాజు, చిల్ల రాంపైడి తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిసాకు నివాళి



మొక్కలు నాటుతున్న వాకర్స్

పీఎం పాలెం: మదర్ థెరిసా జయంతిని పీఎం పాలెం తులసీనగర్ పార్కులో సోమవారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిసా చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాదె రోశిరెడ్డి, స్థానిక వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, వనితా వాకర్స్ అధ్యక్షురాలు జ్యోతీకమల పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్కు లో కొబ్బరి మొక్కలు నాటారు. ఇటీవల మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఐజాక్ లోవరాజు, కె.వెంకటరావు, షేక్ సుబానీ, నీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514లో సంప్రదించాలి.

22వ రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణమాస ప్రత్యేక పూజలు సోమవారం నాటికి 22వ రోజుకి చేరాయి. అమ్మవారి పూజల్లో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

నైట్ డ్యూటీ కూడా ఒక్కరే చేయాల్సి వస్తోంది



మా పీహెచ్‌సీలో ముగ్గురమే స్టాఫ్ నర్సులం. ఇద్దరు సబ్ స్టాఫ్ ఉండేవారు. కొన్నాళ్ల క్రితం ఒకరు చనిపోవడంతో, ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. నైట్ డ్యూటీ చేయాల్సిన వారిలో సబ్ స్టాఫ్ ఏ కారణం చేతనైనా రాకపోతే ఒక్కరమే డ్యూటీ చేయాల్సిన పరిస్థితి. ఇక్కడ గంజాయి సేవించేవారు, ఆకతాయిలు ఎక్కువ. కనీసం వాచ్‌మన్, సెక్యూరిటీ కూడా లేరు. భయంభయంగా డ్యూటీ చేయాల్సి వస్తోంది.

అనిత, స్టాఫ్ నర్స్, మధురవాడ పీహెచ్‌సీ

ఆందోళనగా ఉంటోంది



యూపీహెచ్‌సీ వద్ద సరైన భద్రత లేదు. ఇక్కడ గంజాయి బ్యాచ్‌తో చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. యూపీహెచ్‌సీ కిటికీలను ఇప్పటికి పదిసార్లు విరగ్గొట్టేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వాతావరణంలో పని చేయాలంటే ఆందోళనకరంగా ఉంటోంది. ఆస్పత్రుల్లో పటిష్ట భద్రత, నిరంతర నిఘా ఉండాలి. అప్పుడే మహిళా వైద్యులకు రక్షణ, భరోసా ఉంటుంది.

– డా.స్రవంతి, ప్రధాన వైద్యురాలు, యూపీహెచ్‌సీ, చేపలుప్పాడ



భగవద్గీత మందిర నిర్వాహకులచే పల్లకీసేవ



మజ్జివలసలో త్రైతసిద్ధాంత ఆలయంలో శ్రీకృష్ణుడు



పవిత్ర జలాలతో బాలగోపాలుని అభిషేకిస్తున్న అర్చకులు

యదుకుల తిలకా.. గోపాలా..

నందనందనుడు ప్రతి ఇంటా కొలువుదీరాడు. కృష్ణాష్టమి పర్వదినాన గృహాలు నందనవనాలయ్యాయి. ఆలయాలన్నీ బృందావనాలను తలపించాయి. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం కనులపండువగా నిర్వహించారు. బుజ్జాయిలు చిన్ని కృష్ణులు, చిన్నారి గోపికల వేషధారణల్లో కనువిందు చేశారు. బాలకృష్ణుడికి ప్రీతిపాత్రమైన పాలు, పెరుగు, వెన్నను నివేదించి, ఉట్టి సంబరాలు నిర్వహించారు.

- అంతటా కృష్ణ నామస్మరణ
- కనులపండువగా కృష్ణాష్టమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వీధుల్లో ఉట్టి సంబరాలు



విశేష అలంకరణలో రాధాకృష్ణులు



టి.నగరపాలెంలో ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

తగరపువలస: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం భీమిలి మండలంలో పలుచోట్ల త్రైతసిద్ధాంత భగవద్గీత ఇందూ జ్ఞానవేదిక-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 5 వరకు 11 రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకలు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టతో ప్రారంభమయ్యాయి. గురుపూజ అనంతరం పండగ విశిష్టతను నిర్వాహకులు తెలియజేశారు. జ్ఞానసత్సంగాన్ని నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

– విజయరాంపురం కమిటీ ఆధ్వర్యంలో దాకమర్రిలో జరిగిన పూజల్లో భీమిలి, డెంకాడ ఎంపీపీలు దంతులూరి వాసురాజు, బంటుమిల్లి వాసుదేవరావు, భీమిలి జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, జనసేన ఇంచార్జ్ పంచకర్ల సందీప్, గాడు తాతినాయుడు, గుడ్డాల ఎల్లయ్య, నీలాపు సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు పాల్గొన్నారు.

- తాటితూరు కూడలిలో జరిగిన మండపం వేడుకలలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్ శిరిగుడి సంతోషి, ఈశ్వరరావు దంపతుల పూజలతో ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జెడ్పీటీసీ వెంకటప్పడు, సర్పంచ్‌లు గాడు వెంకటనారాయణ, పొట్నూరు చంద్రశేఖర్, కొయ్య శ్రీనివాసరెడ్డి, దుంపల ప్రభాకర్, రవ్వ ఈశ్వరరావు, కొయ్య రమేష్, వీఆర్వో పల్లంటి శ్యామ్‌సుందరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుని విశిష్టత గురించి రావణ అక్షయ్ వివరించారు.
- మజ్జివలస త్రైత సిద్ధాంత భగవద్గీత మందిరంలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాడు శ్రీను, ఆశ్రమం కమిటీ అధ్యక్షుడు గౌతమ్ శివకుమార్ వర్మ, కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- గుడివాడలో మొక్క రమణ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా పూజలు నిర్వహించి 250 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు.
- భీమిలి మండలం టి.నగరపాలెం గొల్లవీధి రాధాకృష్ణ ఆలయంలో అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత, సుగంధ ద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ కల్యాణం, హోమం నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ, ఉట్టి సంబరాలు నిర్వహించారు.
- తగరపువలస గీతా మందిరం ఆధ్వర్యంలో పల్లకీ సేవ, ప్రత్యేక పూజలు, గీతాపారాయణం నిర్వహించారు.

పవిత్ర నదీజలాలతో అభిషేకం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠ ప్రదేశంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు రెండోరోజైన సోమవారం ఘనంగా జరిగాయి. బాలగోపాలునికి సప్తనదులైన గంగా, గోదావరి, యమున, సింధు, సరస్వతి, కావేరి, నర్మద నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలతో పాటు 108 పళ్లరసాలు, జలకలశాలు, పంచామృతాలు, పంచగవ్యాలు, వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉయ్యాలసేవ, ఉట్టి మహోత్సవం, ఆటల పోటీలు నిర్వహించారు. 108 మంది ప్రసిద్ధ కళాకారులచే సామూహిక భజగోవిందం కార్యక్రమాన్ని నిర్వహించారు. హరినామ జప మండపంలో పాల్గొన్న భక్తులు జపం చేసి ప్రశాంతత పొందారు. డాక్టర్ నిష్కించిన భక్తదాస ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకలలో దివీస్ లేబొరేటరీ డైరెక్టర్ దివి మధుసూదనరావు, డాక్టర్ ఎస్.వి. ఆదినారాయణ, డాక్టర్ శశిప్రభ దంపతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి సీపీ ఆకస్మిక తనిఖీ

- పోలీసింగ్‌పై పరిశీలన



బీచ్‌రోడ్డులో అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

తగరపువలస: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదివారం అర్ధరాత్రి ఆకస్మికంగా పర్యటించారు. నగర శివారు ప్రాంతాలైన హనుమంతవాక, మధురవాడ, భీమిలి క్రాస్‌రోడ్డు, తిమ్మాపురం తదితర ప్రాంతాల్లోని పోలీసింగ్‌పై పరిశీలన చేశారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా స్వయంగా పరిశీలించారు. గతంలో తాను ఇచ్చిన 79950 95799 నంబరుకు వచ్చే ఫిర్యాదులకు సంబంధించి వాస్తవాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాత్రివేళ శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గస్తీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని, వీధిదీపాలు లేనిచోట కొత్తవి వేయిస్తున్నామని చెప్పారు. నగర భద్రత దృష్ట్యా రాత్రివేళ గస్తీ పెంచడం, చెక్‌పోస్టులు, బ్లూకోల్ట్ బృందాలు, పెట్రోలింగ్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పటిష్టంగా నిర్వహిస్తున్నామన్నారు. నగర పరిధిలో ఎలాంటి సమాచారమైనా.. పోలీసుల నిర్లక్ష్యంగా వ్యవహరించినా, లంచాలు అడిగినా 79950 95799 నంబరుకు తనకు ఫిర్యాదు చేయాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు.

ఏయూ హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను సోమవారం ఏయూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబు ముందుగా మెస్‌లలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను స్వయంగా రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లు తనిఖీ చేశారు. వారికి వసతి కల్పిస్తున్న విధానాన్ని గమనించారు.



శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో బాలకృష్ణులు

నందనందనా..



ఆనందపురంలో నిర్వహించిన బాలగోకులంలో పాల్గొన్న చిన్నారులు

- చిన్ని కృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు
- అలరించిన 'బాల గోకులం'



చిన్ని కృష్ణుని వేషధారణలో మధురవాడకు చెందిన చిన్నారి



ఆనందపురంలో సందడి చేస్తున్న బాలకృష్ణుడు



తగరపువలసలో శ్రీకృష్ణ వేషధారణలో బాలుడు



గోపికల వేషధారణలో విద్యార్థినులు



వెన్న దోచే చిన్నికృష్ణుడిగా ..

తగరపువలస/మధురవాడ/కొమ్మాది : నుదుటిన కస్తూరి తిలకంతో.. శిఖలో నెమలిపింఛంతో.. చేతిలో వేణువుతో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు కనువిందు చేశారు. ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన విహార్‌ఆధ్వర్యంలో ఆనందపురం, భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయంలో చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. మూడు వర్గాలుగా నిర్వహించిన ఈ పోటీలలో రెండుచోట్లా వంద మందికి పైగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణతో శ్లోకాలు, పద్యాలు అనర్గళంగా చెప్పారు. శింగనబంద రామాలయంలో జరిగిన కార్యక్రమంలో జి.హేమశ్రీ, ఎస్.నితీష్ , ఎం.యక్షిత, ఎం.నిశాంత్, బి.నీలేంద్ర, ఎస్.మహేష్ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి సర్పంచ్ గాడు వెంకటనారాయణ బహుమతులు అందించారు. మిథిలాపురి వుడా కాలనీలోని ఆదిత్య ఫార్చ్యూన్ గేటెడ్ కమ్యూనిటీ, శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మీ టవర్స్‌లో చిన్నారులు గోపికా, గోపాలుడి వేషధారణల్లో అలరించారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంతో పాటు విశాఖ వ్యాలీ స్కూల్, ఇతర పాఠశాలల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు.

అధ్వానంగా కల్యాణమండపం

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- ఆకతాయిల అల్లరితో విద్యార్థినుల్లో కలవరం



కల్యాణమండపం



చెత్తా చెదారాలతో నిండిన కల్యాణ మండపం హాలు



తుప్పలతో నిండిన కల్యాణ మండపం వంటశాల

భీమునిపట్నం: భీమిలి మూడో వార్డు పరిధిలోని జీవీఎంసీకి చెందిన మహాత్మాగాంధీ కల్యాణ మండపం పాడై, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. స్థానిక సీబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా ఉన్న స్థలంలో 1998లో అప్పటి మున్సిపాలిటీ ఈ కల్యాణ మండపాన్ని నిర్మించింది. ఇందులో విశాలమైన హాలు, వేదిక దానికి ఇరువైపులా రెండు గదులు, పక్కన వంటశాలతో పాటు అవసరమైన సదుపాయాలు కల్పించింది. అప్పటి నుంచి ఇందులో వివాహాలతో పాటు ఇతర శుభకార్యాలు జరిగేవి. తరువాత కొంతకాలానికి ప్రైవేటు వ్యక్తి లీజుకు తీసుకుని నిర్వహించారు. పేద, మధ్య తరగతి వారికి అద్దె అందుబాటులో ఉండటంతో పలు కార్యక్రమాలు జరిగేవి. కాగా నెలకు రూ.10వేల లీజుతో ఉన్న ఈ కల్యాణ మండపం జీవీఎంసీలో విలీనం అయిన తరువాత, లీజు సొమ్ము నెలకు ఏకంగా రూ.40వేలు పెరిగిపోయింది. ఆ మేరకు ఇక్కడ ఆదాయం లేకపోవడంతో పాటు లీజుదారుడి సమయం కూడా ముగియడంతో అతను దాన్ని వదిలేశాడు. తరువాత కొత్తవారు ఎవరూ ముందుకు రాకపోవడంతో నిరుపయోగంగా ఉండిపోయింది.

మితిమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

కల్యాణమండపం వినియోగంలో లేకపోవడంతో తలుపుల గడియలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారు. ఇందులో అనేక మంది మద్యం, గంజాయి సేవించడం లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. దీని ఎదురుగానే పాఠశాల ఉండడంతో ఆకతాయిల గోల విద్యార్థులకు సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో అద్దె భవనంలో నిర్వహిస్తున్న అప్పికొండవీధి సచివాలయాన్ని ఇందులో నిర్వహించడానికి అధికారులు నిర్ణయించారు. దీంతో ఇది వినియోగంలోకి రావడంతో పాటు సమస్యలు ఉండవని భావించినా.. అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ఈ కల్యాణ మండపం పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. భవనం మొత్తం పాడైపోయి శిథిలావస్థకు చేరుకుంటోంది. భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని.. ఈలోగా భవనం తలుపులకు తాళాలు వేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆడపిల్లల్లో ఆందోళన

కల్యాణ మండపం పాఠశాల ఉండటంతో విద్యార్థులు రోజూ ఈ మార్గంలో వచ్చి వెళ్తుంటారు, కాని ఇక్కడ ఆకతాయిలు ఉండడంతో ఆడపిల్లలు భయాందోళనలకు గురవుతున్నారు. పైనున్న బ్యాంకు రోడ్డుకు వెళ్లడానికి అటునుంచి కిందకు వచ్చే మహిళలకు కూడా సమస్యగా ఉంది. చీకటి పడిన తరువాత ఎవరైనా ఇటువైపు రావాలంటేనే భయపడుతున్నారు. చాలా నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయం



ఈ రోడ్డులో వెళ్లాలంటేనే భయపడుతున్నాం. ఆడపిల్లలను ఒంటరిగా పంపించాలన్నా ఆందోళనగానే ఉంటోంది. ఆకతాయిలు ఇక్కడే ఉండటం చాలా ఇబ్బందికరంగా ఉంటోంది. ఇటు రావడానికి భయపడి, దూరమైనా చుట్టూ తిరిగి వేరే మార్గంలో వెళ్లాల్సి వస్తోంది.

– బుగత భారతి, భీమిలి

అధికారులు స్పందించాలి



ఈ కల్యాణ మండపం విషయంలో అధికారులు స్పందించాలి, దీన్ని బాగు చేసి వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు ప్రస్తుతం ఉన్న ఇబ్బందులు ఉండవు. దీనిపై దృష్టి సారించాలి.

– పైల కుమారి, భీమిలి


చర్యలు తీసుకుంటాం



కల్యాణ మండపానికి సంబంధించి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ముందు మండపాన్ని శుభ్రం చేసి, ఎవరూ లోపలికి వెళ్లకుండా చూస్తాం. సచివాలయం ఏర్పాటుకు ఏ మేరకు అవకాశం ఉంటుందో పరిశీలిస్తాం. త్వరితగతిన పనులు జరిగేలా చూస్తాం.

– కె.కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్

వేగవంతంగా సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న మహిళా మోర్చా అధ్యక్షురాలు సుజాత

తగరపువలస: భీమిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత కోరారు. స్థానిక 2వ వార్డు అధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక్కొక్క కార్యకర్త కనీసం వంద మందిని పార్టీలో చేర్చాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రాజన్న, పెదగాడ విజయ, గుజ్జు రాము, నర్సుబాయి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: కేంద్ర ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు, నాయకులు ప్రజలకు చేరవేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు కోరారు. పద్మనాభం గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే నెల ఒకటి నుంచి సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. ఎనిమిది వేల సభ్యత్వాలను చేర్పించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, నాయకులు ఎస్.ప్రకాశ రావు, హెచ్.మహేష్, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

నేడు సింహగిరిపై కృష్ణాష్టమి

- సాయంత్రం 6 వరకే దర్శనాలు
- రేపు ఉట్ల సంబరం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమిని వైభవంగా నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. రాత్రి శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు, బాలకృష్ణుడికి బేడా తిరువీధి నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల వరకే స్వామివారి దర్శనాలు భక్తులకు లభిస్తాయని పేర్కొన్నారు. ఆరాధన టిక్కెట్లు రద్దు చేసినట్లు వెల్లడించారు. నిత్యం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఉండే రాజభోగం బ్రేక్ మంగళవారం ఉండదని, ఆ సమయంలో కూడా భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు సింహగిరిపై ఉట్ల సంబరం ఉంటుందన్నారు.